క్లుప్తంగా

రేపు మున్సిపల్ అత్యవసర సమావేశం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ పాలకవర్గ అత్యవసర సమావేశాన్ని సోమవారం చైర్మన్ తిరునగర్ భార్గవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అత్యవసర సమావేశంలో స్ట్రామ్ వాటర్, డ్రైయినేజీలో డిసిల్టింగ్‌లపై చర్చించనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే అత్యవసర సమావేశానికి కౌన్సిలర్లు తప్పక హాజరుకాగలరని కోరారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మూడేళ్లుగా విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు రాయించు నర్సింహ్మా, చిలకల మురళి యాదవ్, మహేశ్వరపు నరేష్, ఎర్రబెల్లి గంగాధర్, రమేష్, శ్రీను తదితరులున్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేవరకొండ మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా తెలియజేయ వచ్చన్నారు.

ప్రతి సోమవారం ప్రజావాణి

అడవిదేవులపల్లి : ప్రతి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కరుణాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి గ్రామ పంచాయతీల్లో ప్రజావాణి కేంద్రం ఏర్పాటు చేసినందున ప్రతి గురువారం ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నదాన సత్రం కమిటీ ఉపాధ్యక్షుడిగా సైదాచారి



సైదాచారిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మండలోజు సైదాచారి ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో సైదాచారిని శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు ఈశ్వరాచారి, కార్యదర్శి శ్రీనివాస్‌చారి, నాయకులు శ్రీనివాసాచారి, రవీంద్రాచారి, కోటయ్య, పాలకి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశ్వబ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

మిర్యాలగూడ : పట్టణంలోని జేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సామాజికి వర్గానికి సంబంధించిన వారికి వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ సేవా సంస్థ కన్వీనర్ తాడోజు శ్రీనివాసచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వనపర్తి డిప్యూటీ కలెక్టర్ చొల్లేటి వెంకటేశ్వర్లు హాజరవుతాయరని పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాబత్తుల శ్రీనివాసచారి, ఈశ్వరచారి పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : ఇండియన్ టాలెంట్ టెస్ట్ ఒలింపియాడ్‌లో ఆదిత్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభా చాటినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మరి కొంత మంది విద్యార్థులు సైన్స్, మథ్స్‌లలో ఎక్సలెంట్ అవార్డులు, గోల్డ్ మెడల్స్, సిల్వర్, బ్రోంజో మోడల్‌ను సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఇటుక బట్టీ.. నిబంధనలు పక్కనబెట్టి

- చింతపల్లిలో పుట్టగొడుగుల్లా బట్టీల ఏర్పాటు
- రోడ్డు పక్కనే బట్టీల నిర్వహణ
- రాత్రిపగలు జోరుగా నల్లమట్టి రవాణా
- ధ్వంసమవుతున్న రహదారులు



గడియగౌరారం సమీపంలో డంప్ చేసిన నల్లమట్టి



టిప్పర్ల రాకపోకలతో ధ్వంసమైన నసర్లపల్లి - నెల్వలపల్లి వెళ్లే రహదారి

చింతపల్లి : మండలంలోని హైదరాబాద్ –నాగార్జునసాగర్ రోడ్డు పక్కనే నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. అంతేగాక రాత్రి, పగలు తేడా లేకుండా దేవరకొండ ప్రాంతం నుంచి టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పంట పొలాలు నాశనం అవుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా నల్లమట్టి రావాణాతో నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి నెల్వలపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రహదారి పూర్తిగా మట్టి రోడ్డుగా మారింది. ప్రభుత్వ అనుమతులు నామమాత్రంగా తీసుకొని ఇటుక బట్టి వ్యాపారులు లక్షల్లో సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు బట్టీల నిర్వాహణపై ఏ మాత్రం నియంత్రణ లేనట్లుగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇటుక బట్టిల్లో నల్లమట్టి రవాణా రాత్రి పగలు తేడా లేకుండా ధనార్జనేధ్యేయంగా జోరుగా సాగుతుంది.

అనుమతులు లేకుండానే..

చింతపల్లి మండలంలో కొంతమంది ఇటుక బట్టీల వ్యాపారులు రెవెన్యూ, గనులు, విద్యుత్, కార్మిక శాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ ఇవేమీ లేకుండా ఇష్టారాజ్యంగా బట్టీలను నిర్వహిస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు ఒకే చోట పదుల సంఖ్యలో పెద్ద పరిశ్రమను తలపించేలా ఇటుక బటీలను ఏర్పాటు చేసి వాటికి కావాల్సిన మట్టిని చెరువులనుంచి అనుమతులకు మించి తరలిస్తున్నారు. ఇటుక బట్టిల కోసం ఒక్కో బట్టీ 20 నుంచి 30 ఎకరాల వరకు రైతుల వద్ద నుంచి లీజుకు తీసుకుంటున్నారు. మండల కేంద్రంతో పాటు గడియగౌరారం, నసర్లపల్లి, తిరుమలాపురం, వెంకటంపేట గ్రామాల్లో అనుమతులు తీసుకోకుండానే ఇటీవల బటీలను నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారి సమీపంలో ఇటుక బట్టీలు నిర్వహిస్తుండడంతో వాటి నుంచి వెలువడే దుమ్ము, ధూలి నుంచి ఇబ్బందులుపడుతున్నారు. ఇటుకల బట్టీ గ్రామానికి 800 మీటర్ల దూరంలో బట్టిలు ఉండాలని, రెండిటికి మధ్య కనీసం కిలోమీటర్ దూరం పాటించాలని పర్యావరణ శాఖ నిబంధనలు సూచిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు ఇటుక బట్టీల నిర్వాహకులతో కుమ్మక్కై వారికి సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీ అనుమతులతో పాటు రైతు అగ్రికల్చర్ భూమిని నాలా కన్వెన్షన్ చేయాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ ఏర్పాటు చేసిన ఏ ఒక్క బట్టీకి కూడా గ్రామపంచాయతీల అనుమతులు లేవని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. అగ్రికల్చర్ భూమి నాన్ అగ్రికల్చర్ భూమిగా మార్చేందుకు రెవెన్యూ అధికారుల అనుమతులు కూడా లేవని రెవెన్యూఅధికారులు పేర్కొంటున్నారు.

ధ్వంసమవుతున్న రహదారులు..

మండలంలోని తిరుమలాపురం సమీపంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలకు నల్లమట్టిని తరలిస్తున్న టిప్పర్లతో నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్ల రాకపోకలు కొనసాగిస్తుండడంతో బీటీ రహదారులు కాస్త మట్టి రోడ్డుగా మారిపోయింది. రోడ్డు వెంట తిరుమలాపురం, నెల్వలపల్లి, పస్నూరు, ఉప్పరపల్లి గ్రామాలకు వెళ్లేప్రజలు ప్రమాదాలకుగురయ్యే అవకాశం ఉంది.

మట్టిరోడ్డుగా మారింది



నసర్లపల్లి ఎక్స్ రోడ్డు నుంచి మా గ్రామానికి వెళ్లే బీటీ రహదారి పది రోజుల నుంచి టిప్పర్ల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే రోడ్లుపై నల్లమట్టిపడడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందో తెలియక ఇబ్బందులుపడుతున్నాం.

– గొడ్డేటి మధు, నెల్వలపల్లి

అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు



మండలంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ శాఖ నుంచి ఇప్పటి వరకు బట్టీల కోసం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. బట్టీలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం

– విజయ్‌కుమార్, తహసీల్దార్, చింతపల్లి

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ : సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో సెర్ప్ ఏపీఎం, సీసీలతో పాటు శ్రీనిధి అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళా సంఘంలోని ప్రతీ మహిళకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళా సంఘం సభ్యులు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతి మహిళను మహాలక్ష్మీగా భావించి ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. మహిళా సంఘాల తీర్మానం మేరకు మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యత్వం పొందిన సభ్యులకు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలని వినతి

దేవరకొండ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థులు ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ,ఎనిమల్ల సాయి ,కొర్ర రాంబాబు, నాగేందర్, పవన్, శివ, రమేష్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా

చింతపల్లి : భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం కిష్టరాయినిపల్లి, ఈదులగండి గ్రామాల్లోని డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములుకోల్పోయిన రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అధైర్యపడొద్దని, అన్నివిధాలుగా వారికి అండగా ఉంటామన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజి నిర్వాసితులకు అందజేలా కృషి చేస్తానని, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీఓ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి..

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రయామున్నిసాబేగంతో పాటు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఉదయం 8 గంటలకు కుర్మేడు ఎక్స్‌రోడ్డు నుంచి కుర్రంపల్లి, సాయిరెడ్డిగూడెం, మొద్దులమల్లేపల్లి, పీకే.మల్లేపల్లి, కిష్టరాయినిపల్లి, రాయిగూడెం గ్రామాల మీదుగా చింతపల్లి ఎక్స్ రోడ్డు నుంచి మోడల్ స్కూల్ వరకుబస్సు నడపాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనివాస్, వెంకన్న, గౌతమ్‌బాబు, ఆంజనేయులు, విజయ్‌కుమార్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

పెద్దవూర : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కార్మికవర్గానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన సీఐటీయూ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను అమలు చేస్తామని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తవుతున్నా కార్మికులకు ఇచ్చిన హామీల గురించి కనీసం ఆలోచించే పరిస్థితి లేదని విమర్శించారు. అనంతరం 21 మందితో కూడిన సీఐటీయూ సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఎస్‌కే బషీర్, సభ్యులుగా వెంకటమ్మ, సత్తెమ్మ, ప్రభాకర్, వెంకన్న, మల్లేష్, లచ్చు, అంజి, నూర్జహాన్, దుర్గయ్య, నాగమణి, కృష్ణ, అనురాధ, తరి బిక్షంలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దుబ్బ రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తరి రామకృష్ణ పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

మిర్యాలగూడ : ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా పథకంపై శనివారం మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల, ఆలగడప, మిర్యాలగూడ పీఏసీఎస్ కేంద్రంలో శనివారం ప్రత్యేక మహాజన సభ సమావేశం నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడిసాయంగా రైతు భరోసా పథకం ద్వారా అందించే ఆర్థిక సాయాన్ని సవరించి పథకాన్ని నిజమైన సాగుదారులకు అందించేందుకు నిర్దేశించి కార్యక్రమం అమలుపై రైతుల అభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27న నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెలికాన్ఫరెన్స్ ఆదేశాలతో 43 పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి పథకం అమలుపై రైతుల నుంచి సూచలనలు స్వీకరించి రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రైతులు తమ అభిప్రాయాలను, సూచనలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు పాదూరి సంజీవరెడ్డి, వెలిశెట్టి రామకృష్ణ, వైస్ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, ఏడీఏ పి.నాగమణి, డీసీసీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, ఏవో సరిత, ఏఈఓ రమేష్, రాంబాబు, చైతన్య, నర్సయ్య, రూహిద్, మల్సూర్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది, నాయకులు

దేవరకొండ : దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడుతూ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.15వేల 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ ప్రకారం వేతనాలు చెల్లించకుండా కార్మికులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జీఓ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని ఆయన అధికారులను కోరారు. జూలై 3న హైద్రాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు,రామేశ్వరమ్మ, వనజ, రాణి, భద్రమ్మ, ప్రణయ్, తదితరరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి



రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న ఐద్వా నేతలు

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదని ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలేబోయిన వరలక్ష్మీ, ప్రభావతిలు అన్నారు. శనివారం ఐద్వా ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై సర్వే నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రోగులకు సరిపడా బెడ్లు లేవని, వైద్య సిబ్బంది సైతం తక్కువగా ఉన్నారని, ఆస్పత్రిలో పారిశుద్ధ్య అధ్వానంగా ఉందన్నారు. తక్షణమే జిల్లా వైద్యాధికారులు స్పందించి ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సభ్యులు పాదూరి గోవర్ధన, కౌసల్య తదితరులున్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్: విద్యాహక్కు చట్టం 2009 అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముదికొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో నల్లగొండలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను జిల్లా పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేసే విధంగా వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా కన్వీనర్ నారపాక అంజి, డోలుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాల్ల యాదయ్య, ఎడవల్లి శ్రీనివాస్, అందుగుల ఆనంద్, నారపాక లక్ష్మణ్, బచ్చలకూరి అంజయ్య పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవూర : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించనున్న గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ సక్రునాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కోమటికుంటతండాలో నిర్వహించిన ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన తెగల హక్కుల కోసం 27ఏళ్లుగా ఎల్‌హెచ్‌పీఎస్ పనిచేస్తూ, 500 జనాభా కలిగిన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని, గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ×చలో హైదరాబాద్×కు ప్రతి గిరిజన తండా నుంచి లంబాడాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణావత్ శంకర్‌నాయక్, బావోజీ, సర్దార్‌నాయక్, చందులాల్, పూల్యానాయక్, లాలోజీ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా కలిసి ఉండాలి

హుజూర్‌నగర్‌రూరల్ : కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి ఉండాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ సూచించారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురంలో గల ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులవివక్ష లేకుండా ప్రతిఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చీకూరి రాజారావు, గ్రామ ప్రత్యేకాధికారి, డీటీ కమలాకర్, మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఆర్ఐ, కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాలునాయక్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

దేవరకొండ : ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శనివారం పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజక వర్గంలో అత్యధికంగా బడుగు, బలహీన వర్గాల వారు ఎక్కువగా ఉన్నారని, ఈ ప్రాంత ఎమ్మెల్యేకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తే నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. 30ఏళ్లుగా దేవరకొండ నియోజకవర్గానికి మంత్రి వర్గంలో చోటు దక్కలేదని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు చొల్లేటి భాస్కరాచారి, చంద్రమౌళి, నాగయ్య,కృష్ణాచారి,అజ్మతుల్లా,ముశిని సత్యం, బాబురాం నాయక్, శ్రీను, బ్రహ్మచారి, పాల్గొన్నారు.

జూలై 2న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దేవరకొండ : జూలై 2న దేవరకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు దేవరకొండ ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల మండల అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

కొండమల్లేపల్లి : విద్యుత్ కార్మికుల సంఘం ఐఎన్‌టీయూసీ 327 జెండాను శనివారం ఎమ్మెల్యే బాలునాయక్ ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని జనప్రియ గార్డెన్స్‌లో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ డివిజన్ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ కార్మికులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ శ్రీధర్, డివిజన్ సెక్రటరీ ఎండీ. నిరంజన్‌అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, వెంకటయ్య, యూనూస్, హరికృష్ణ, పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడితో డైరెక్టర్లు

పెద్దవూర : మండలంలోని పోతునూరు గ్రామ పాల ఉత్పత్తిదారుల సేవా సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేపాకుల బక్కయ్య, డైరెక్టర్లుగా పచ్చిపాల కోటయ్య, ముత్యాల నాగరాజు, వెంకటయ్య, అర్జున్‌రావు, గపయ్య, సైదయ్య, వెంకటేశ్వర్‌రావు, రామేశ్వర్‌రావులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత ఎంఈఓ వడ్లపల్లి నర్సిరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బక్కయ్య మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ప్రతి రైతుకు చేరేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన కిరణ్, ముత్యాల శ్రీనివాస్, ఇనుపాముల శ్రీను, రాములు, సత్యనారి, సత్తయ్య, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



స్తంభం కింద భాగాన కట్టిన వైర్లను చూపిస్తున్న స్థానికుడు

మిర్యాలగూడ అర్బన్ : విద్యుత్ స్తంభానికి చివరగా కట్టాల్సిన వైర్లు స్తంభం కిందకు కట్టడం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. పట్టణంలోని వైష్ణవి హోటల్ దగ్గర అశోక్‌నగర్ లో మూడు నెలలుగా విద్యుత్ వైర్లు కిందకు కట్టి ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభానికి వైర్లు లాగిన విద్యుత్ అధికారులు చివర స్తంభానికి వైర్లు ఇలా కిందకు కట్టి వదిలవేయడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అనుకోని పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా అయితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి వైర్లను పైకి కట్టించాలని వారు కోరుతున్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తిస్తేనే గుర్తింపు



గుర్రంపోడు : గణేష్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ తరి రాము



చింతపల్లి : మంజులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుర్రంపోడు : విధులు సక్రమంగా నిర్వహిస్తేనే అందరి మన్ననలు పొంది గుర్తింపు వస్తుందని ఎంఈఓ తరి రాము అన్నారు. శనివారం పోచంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కె. గణేష్ ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే అందరి మన్ననలు పొందుతాడన్నారు. ఈ సందర్భంగా గణేష్‌ను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ నోముల యాదగిరి, నకిరేకల్ హెచ్ఎం రాములు, మాజీ సర్పంచ్ గుత్తా తిరుమల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు, సీఆర్పీ జాల శంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

చింతపల్లి : మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు మంజులకు శనివారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు వాణి, కృష్ణవేణి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ కెమెరా దినోత్సవం



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో జాతీయ కెమెరా దినోత్సవాన్ని శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాలుగా కెమెరామెన్ వృత్తిలో ఉన్న కురువేళ్ల రవి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, రామస్వామి, గున్‌రెడ్డి, సైదిరెడ్డి, శ్రీను, వెంకట్‌రెడ్డి, ఉన్నారు.